

నగరంలోని స్నేహ సొసైటీలో..



కేర్ డిగ్రీ కళాశాలలో..



భీమ్‌గల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న సిబ్బంది, విద్యార్థినులు



కమ్మర్‌పల్లిలో బతుకమ్మ ఉత్సవాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు

# ఘనంగా బతుకమ్మ సంబురాలు

కమ్మర్‌పల్లి/ భీమ్‌గల్/బాల్కొండ/ ఖలీల్‌వాడి, అక్టోబర్ 18 : జిల్లావ్యాప్తంగా పలు మండలాలు, గ్రామాల్లో మహిళలు బుధవారం బతుకమ్మ ఆడారు. మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, ప్రధాన కూడళ్ల వద్ద ఉంచి సంప్రదాయబద్ధంగా ఆడిపాడారు. పలు కళాశాలల్లో బతుకమ్మ సంబురాలు నిర్వహించగా.. విద్యార్థినులు సందడి చేశారు. నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో విద్యావేత్త నరాల స్వప్నా సుధాకర్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలకృష్ణ, వైస్‌ప్రిన్సిపాల్ నరేశ్, సందేశ్, వినయ్, కళ్యాణి, అనురాధ, కవిత, శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు. నగరంలోని మారుతినగర్‌లో ఉన్న స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, జ్యోతి, మోహిద్ అహ్మద్, రాజేశ్వరి, కిరణ్మయి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, బాల్కొండ మండల కంద్రాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బుధవారం బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. మహిళా సిబ్బంది, విద్యార్థినులు బతుకమ్మ ఆడారు. అనంతరరం చెరువుల్లో నిమజ్జనం చేశారు. కమ్మర్‌పల్లిలో కళాశాల ప్రిన్సిపాల్ అబ్బ చిరంజీవి, అధ్యాపకులు డాక్టర్ నర్సింహ స్వామి, జయానంద్, సత్య నారాయణ, సుధాకర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. భీమ్‌గల్‌లో కళాశాల మహిళా సిబ్బందితో కలిసి విద్యార్థినులు బతుకమ్మ ఆడారు.

ప్రిన్సిపాల్ అబ్బ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు. బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ చిన్నయ్య తెలిపారు. అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి వేములకు పలువురి పరామర్శ



మంత్రి వేములను పరామర్శిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

వేల్పూర్, అక్టోబర్ 18: మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ ఇటీవల మృతి చెందగా మంత్రి వేములను బుధవారం వేల్పూర్‌లోని నివాసంలో నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, స్నేహితులు పరామర్శించారు. ఈ సందర్భంగా మంజులమ్మ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. మంత్రి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## అభివృద్ధి పనులపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎంపీపీ పస్క నర్సయ్య

ఆర్మూర్, అక్టోబర్18: మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ పస్క నర్సయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు అభివృద్ధి పనులపై నివేదికను చదివి వినిపించారు. వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భోజకళా చిన్నరెడ్డి, ఎంపీపీటీసీ సురేశ్, ఎంసీ గంగారెడ్డి, ఎర్రక్క, హన్మాండ్లు, ఎంపీడీవో శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి హరికృష్ణ, వైద్యురాలు పూజితరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చక్రేశ్వర శివాలయంలో ఎమ్మెల్సీ కవిత పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బోధన్ రూరల్: బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివమందిరాన్ని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ కవిత బుధవారం సందర్శించారు. బోధన్ పట్టణంలోని వివిధ కార్యక్రమాల్లో భాగంగా పట్టణానికి వచ్చిన ఆమె శివాలయంలో శివలింగానికి అభిషేకం చేశారు. అనంతరం ఆలయంలో పూజలు, హారతి నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టాలంటూ స్థానికులు కవితకు విన్నవించారు. మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయిస్తానని ఆమె అన్నారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన సార్వజనిక్ దుర్గామాత విగ్రహం వద్ద కవిత పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ కవిత వెంట బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ ఎం.రజితాయాదవ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు బీర్కూర్ శంకర్ (బుజ్జి), సార్వజనిక్ దుర్గామాత ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పూజారి లింగం, డైరెక్టర్లు లక్ష్మణ్ రావు పటేల్, ఎంఎల్ బాబు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్ యాదవ్, అబ్దుల్ రహ్మాన్, బుద్దె రాజేశ్వర్, ఏఎంసీ వైస్ చైర్మన్ సాలూరా షకీల్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆర్మూర్‌లో 'జాగృతి' బతుకమ్మ సంబురాలు

ఆర్మూర్, అక్టోబర్18: పట్టణంలోని పాతబస్టాండ్ ప్రాంతంలో ఉన్న జంబిహనుమాన్ ఆలయ ఆవరణలో గురువారం స్థానిక ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, భారత జాగృతి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నారు. ఆలయ ఆవరణను బుధవారం శుభ్రం చేసి మైదానంలో లైటింగ్ ఏర్పాటు చేశారు. ఈ బతుకమ్మ సంబురాల్లో పాల్గొనేందుకు భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో కలిసి ఆర్మూర్ ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ ఆశన్నగారి జీవన్‌రెడ్డి హాజరుకానున్నారు. ఉదయం 9.30 గంటలకు కవిత ఆర్మూర్‌కు చేరుకుంటారు. అనంతరం కాశీ హనుమాన్ వీధిలోని మున్నూరు కాపు సంఘం, పెర్కిట్ గురడి రెడ్డి కాపు సంఘం, మామిడిపల్లిలో మాజీ సర్పంచ్ రవిగౌడ్, మహాలక్ష్మి కాలనీలో మాజీ మున్సిపల్ చైర్మన్ స్వాతిసింగ్‌బబ్లూ, మహాలక్ష్మి కాలనీలోని ఆర్యవైశ్య సంఘంలో, హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినిత పవన్, జాగృతి కన్వీనర్ సాయినాథ్ ఇండ్లలో బతుకమ్మలను పేర్చే కార్యక్రమాల్లో కవిత పాల్గొంటారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు బతుకమ్మ సంబురాలు జరుగనున్నాయి. సాయంత్రం 6గంటలకు ఆర్మూర్ పట్టణంలోని జెండా బాలాజీ ఆలయ వీధి నుంచి ఊరేగింపుగా జంబిహనుమాన్ ఆలయానికి చేరుకొని అక్కడ వేలాదిమంది మహిళలతో బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నారు.

## బతుకమ్మ సంబురాలకు తరలిన మహిళలు

నవీపేట, అక్టోబర్ 18: బోధన్ పట్టణంలో బుధవారం ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో పాల్గొనేందుకు మండంలోని పలు గ్రామాల నుంచి మహిళలు తరలి వెళ్లారు. మండలంలోని పోతంగల్, బినోలా తదితర గ్రామాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. పోంతగల్ సర్పంచ్ తుంగినీ రవీందర్ రావు ఆధ్వర్యంలో మహిళలు బోధన్ వెళ్లారు. బీఆర్‌ఎస్ నాయకులు సొదశ్రీనివాస్, నవీన్, సర్పంచ్ మీనా తదితరులు తరలి వెళ్లారు.

## విద్యార్థులకు దుస్తులు పంపిణీ

శక్కర్‌నగర్, అక్టోబర్ 18: బోధన్ పట్టణంలోని పలువురు నిరుపేద విద్యార్థులకు వలంటీర్ సనాపటేల్ పలువురు దాతల సహకారంతో దుస్తులు పంపిణీ చేశారు. బోధన్ పట్టణంలోని రెక్సిన్ వర్క్స్ వ్యాపారితోపాటు పలువురు రేషన్ డీలర్ల సహకారంతో దసరా సందర్భంగా దుస్తులు పంపిణీ చేసినట్లు సనాపటేల్ తెలిపారు.

## పోస్టర్లు ఆవిష్కరణ

శక్కర్‌నగర్, అక్టోబర్ 18: నవంబర్ 5న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో నిర్వహించే 'మాదిగల యుద్ధభేరీ' కార్యక్రమానికి చెందిన పోస్టర్లను బుధవారం బోధన్ పట్టణంలో టీఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఆసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందుగుల విద్యాసాగర్ మాట్లాడుతూ మాదిగలకు అన్ని రంగాల్లో న్యాయం చేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి డప్పుల చంద్రయ్య, నాయకులు భూమయ్య, ఈరపురం పోశెట్టి, భూమయ్య, శంకర్, రాము, నాగులు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఒకరు మృతి



నగేశ్(ఫైల్)

నవీపేట, అక్టోబర్ 18: మండలంలోని నందిగామకు చెందిన కప్ప నగేశ్(39) బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నగేశ్ వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని స్కూల్ వెనుక భాగంలో వ్యవసాయ పొలం సమీపంలో బహిర్భూమికి వెళ్లాడు. వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైర్‌కు తగలడంతో విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుడికి భార్య అనుష, కుమారుడు సూర్యతేజ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

## కొడుకు హత్య కేసులో తండ్రి రిమాండ్

నవీపేట, అక్టోబర్18: మండలంలోని మోకన్‌పల్లి గ్రామంలో కొడుకు సంగెం శ్రీకాంత్‌ను హత్య చేసిన తండ్రి కిషన్‌ను బుధవారం నార్త్ రూరల్ సీఐ సతీశ్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్ భార్య రెండేండ్ల కిత్రం మృతి చెందింది. రెండో పెండ్లికి కుమారుడు అభ్యంతరం చెప్పడంతోపాటు పొలం అమ్మిన డబ్బుల విషయంలో తండ్రీ కొడుకుల మధ్య ఈనెల 14న ఘర్షణ చోటుచేసుకుంది. రెండో పెండ్లికి అడ్డు రావడంతోపాటు పొలం డబ్బులను ఇవ్వమంటున్నాడనే అక్కసుతో కొడుకును తండ్రి కిషన్ పథకం ప్రకారం హత్య చేశాడు. రెండు రోజుల నుంచి పరారీలో ఉన్న కిషన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

## సద్వినియోగం చేసుకోవాలి

రెంజల్, అక్టోబర్ 18: వచ్చేనెలలో నిర్వహించనున్న శాసన సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని తహసీల్దార్ రాంచందర్ ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే పునపరిశీలించాలని పేర్కొన్నారు.

## ఈనెల 31వరకు ఓటరు నమోదుకు అవకాశం

ఏర్గట్ల, అక్టోబర్ 18: ఇప్పటి వరకు ఓటరు లిస్టులో పేరు నమోదు చేయించుకోని వారు ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ యూసుఫ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అన్ని గ్రామాల్లో 18 ఏండ్లు నిండిన యువత ఓటు హక్కు కోసం ఫారం6ను పూర్తి చేసి మీ సేవల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.



కమ్మర్‌పల్లిలోని శ్రీ భాషిత జూనియర్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సంవత్సర విద్యార్థులు, అధ్యాపకులు, మేనేజ్‌మెంట్ సభ్యులు స్వాగతం పలికారు. విద్యార్థులు డాన్స్‌లతో అలరించారు. – కమ్మర్‌పల్లి, అక్టోబర్ 18